# ఊహామూర్తి

కథ

''మేరేజెస్ ఆర్ మేడిన్ హెవెన్''- అని ఎవరన్నారోకానీ..వాళ్ళోసారి కన్పడితే బావుణ్ణు. ఎడా పెడా వాయిoచాలని వుంది. ఉంటే గింటే అవి 'మేడిన్ హెల్' అయి ఉండాలి.

పెళ్ళనేది ఒక పెద్ద బిజినెస్ డీలింగ్ అంటాను నేను.

మగవాడి బ్రతుకు వ్యాపారానికి స్త్రీ ఒక పెట్టుబడి వస్తువు. ఆమెతోపాటుగా, కొన్ని లక్షల సొమ్ము, తోడుగా ఒక ప్లాటో..అపార్ట్‌మెంటో వుండాలి. ఇక బంగారం, వెండి, వస్తు వాహనాలు సరేసరి.

ప్రస్తుత రోజుల్లో కంప్యూటర్ చదువు, వుద్యోగం. ఇవన్నీ కనీసంగా వుండవలసినవి. వీటితోపాటుగా అత్యంత అవసరమైన ముడిసరుకు అందం. ఇన్ని..అన్నీవున్నా ఆ పిల్ల బ్రతుకు అతనితో సంతోషంగా వుంటుందాని ప్రశ్నించుకుంటే? అదొక్కటే అనుమానం.

ఇట్లాంటి గొప్ప 'డీలింగ్' [illegible]లో నిర్ణయించబడుతుందంటే?!

అసలు హెవెన్ అంటే ఏవిటబ్బా! 'నరకానికి మరో అందమైన పేరు కాదు కదా?'- అనే అనుమానమొస్తుంది నాకు.

★ ★ ★

నా పేరు భావ్యాష.

నేను మరీ సన్నం కాదు కానీ, నా నడుం మరీ సన్నగా వుండటము వలన, నేను లావు అనే మాట నుండి తప్పించుకున్నాను. ఆ, నా సన్నటి నడుం మీద నా భర్త శ్రీరాం, తన అరచేత్తో నిమురుత్తూ-

''నీకేం కావాలో లిస్ట్ రాసిపెట్టు. సాయింత్రం ఆఫీసు నుండి వస్తూ తీసుకు వస్తాను'' అన్నారు.

పెళ్లయిన కొత్తరోజులు.

మా అత్తగారూ వాళ్ళు, కట్నాలూ, లాంఛనాలూ అంటూ బాగానే వసూలు చేశారు మానుండి...అనే కక్ష, నా మనసులో వుంది.

అదేమాట మా అమ్మతో అంటే, 'ఆడపిల్లను వదిలించుకోవటానికి ఆమాత్రం పెనాల్టీ కట్టాలి మరి' అంది.

ఆ మాట వింటే నాకు చాలా బాధ వేసింది.

అమ్మ కూడా పరాయిదా అన్పించింది. ఆడపిల్ల అంటే ఆడవాళ్ళకీ లోకువేనా అని కోపం కూడా వచ్చింది.

''నాకేం తక్కువ? అందం లేదా? డిగ్రీలు లేవా? అవసరమైతే వుద్యోగం కూడా చేస్తాను కదా?''- అన్నాను రోషంగా.

''అదిగో! అదే. ఆ పొగరే వద్దన్నాను. ఆడపిల్ల అంటే సౌమ్యంగా, సరళంగా, ఓర్పుగా వుంటూ అన్నింటికీ సర్దుకుపోతూ, కాపురాన్ని నిలబెట్టుకోవాలి'' అంది అమ్మ.

''ఇంత కష్టానికి అంతంత డబ్బా...నగా నట్రా..వాళ్ళకివ్వటం ఎందుకూ? అదేదో నాకే యిచ్చేస్తే బేంక్‌లో వేసుకుని, ఆ వడ్డీతో హాయిగా బ్రతికేస్తాను దర్జాగా..'' అన్నాను.

''బ్రతుకుతావు. మొగుడూ మొద్దులూ లేకుండా. మగరాయుళ్ళా. ఎప్పుడైతే వెంకట సూర్యలక్ష్మి పేరు మార్చుకుని, ఆ పేరేదో పెట్టుకున్నావు చూడూ, అప్పుడే చెప్పానే మీ అమ్మతో, ఇది ఎదిగే కొద్దీ నీకు తిప్పలే. పెళ్ళయితే మొగుడితో సరిగా కాపురం చేస్తుందంటే నాకు అనుమానమే అని.''

వెనగ్గా ఎప్పుడొచ్చి విందో కానీ, మెటికలు విరుస్తూ మా నాయనమ్మ కక్షగా అంది.

నాకు మొదటగా మా నాయనమ్మ పేరు పెట్టారు. ఆ పేరుని నేను యిష్టపడక పదవ తరగతి తర్వాత నా పేరును 'భావ్యాష'గా మార్చుకున్నాను. అప్పటి నుండీ మా నాయనమ్మ నా మీద కక్ష పెంచుకుంది.

''ఇదిగో పెళ్ళి చేసి సలక్షణంగా అత్తారింటికి పంపేవరకే మా బాధ్యత. రేపొద్దున అది నచ్చలేదు, యిది నచ్చలేదంటూ, పెట్టే బేడా సర్దుకుని పుట్టింటికి వస్తే కుదరదని చెప్పు నీ కూతురికి''- నాయనమ్మ మాటలు వినేసరికి మనసు చివుక్కుమంది.

పెళ్ళితో పుట్టినింటికి పరాయిదాన్ని అయ్యానన్న మాట. ఆడపిల్లకు మొదటి శత్రుస్థానం పుట్టిల్లే. అయినా ఒక్క ఆడపిల్ల మీద అంత ఖర్చుపెట్టం వాళ్ళకే బరువని అలా అన్నా కానీ, వాళ్ళకు లేని బాధ నాకెందుకూ?

★ ★ ★

మొన్నటి వరకూ అస్సలు తెలియని వ్యక్తితో కల్సి బ్రతకటం. అతని సాహచర్యంలో కొన్ని కొన్ని చేష్టలు జరగటం..వాటికి శరీరం కంపించటం, మనసుకు థ్రిల్‌నీ, ఏదో ఫీలింగ్‌నీ యిస్తూ వుండటం, ఇవన్నీ ఓ గమ్మత్తయిన సుందర లోకంలో విహరిస్తున్నట్లు అనుభూతిస్తూ వుండటం వల్ల-పెళ్లి నాటి బేరసారాలూ, పుట్టింటి వారి హెచ్చరికలూ తాత్కాలికంగా నా మనసు అట్టడుగుకి వెళ్ళిపోయాయి.

'తొందరగా రాసివ్వు'' - అంటూ శ్రీరామ్ స్నానానికి వెళ్ళారు.

పేపరూ, పెన్నూ తీసుకుంటూ వుంటే అన్పించింది.

''అవునూ నేను లిస్ట్ రాసిస్తే, తను ఆఫీసు నుండి వస్తూ తీసుకు రావటం ఏమిటి? ఆఫీసు నుండి వచ్చిన తర్వాత ఇద్దరం కల్సి వెళ్ళి, నచ్చినవి సెలక్ట్ చేసుకుని, ఆర్డర్ చేసుకోవచ్చుగా? పోన్లే లిస్ట్ రాయటం వల్ల నష్టమేముంది? ఏదేని మర్చిపోయే చాన్స్ వుండదు కూడా, కరక్టే. అయితే మా చిన్నిపొదరింట్లో మొదటి ప్రిఫరెన్స్ దేనికివ్వాలి? బెడ్ రూం.

ఎస్. చక్కని మంచం. మెత్తనీ పరుపూ, పిల్లోస్. నీలాకాశపు రంగులో బెడ్ షీట్స్. కిటికీలకు నీలిరంగు కర్టెన్స్, నేల పైన నీలిరంగు కార్పెట్, బెడ్ ప్రక్కన నీలిరంగు బెడ్‌లైట్. తర్వాత ఉడెన్ డ్రస్సింగ్ టేబుల్. (చెక్కుడు వున్నదయితే రిచ్ అపీరియన్స్ వస్తుంది) అద్దం మాత్రం చాలా పెద్దగా వుండాలి. ఈ విషయంలో నో కాంప్రమైజ్- ఎందుకంటే-

''మీరు చీర కట్టుకుంటే- ఆ కట్టే విధానం మీ ఫిగర్ కీ- మీ ఫిగర్ తాలూకూ అజంతా ఒంపు సొంపులు ఆ చీరకూ గొప్ప అందాన్నీ..ఆకర్షణనూ తీసుకు వస్తుంటే-ఆ అందాలను వీక్షిస్తూ నా మనసు పిచ్చిదై, వెర్రెక్కిపోతూ, మరి ఓర్చుకోలేక మీ చీర చెంగుకు ఉరేసుకుని చచ్చిపోవాలని వుంది మిస్.'' చదువుకునే రోజుల్లో యిలాంటి ఉత్తరాలు అందుకోవటం నాకు మామూలే.

అయితే ఇంత వరకూ నా ఒంటి గురించి గానీ, నా చీర కట్టుగురించి గానీ, నా భర్త యింకా నన్ను మెచ్చుకోలేదు.

ఏమైనాగానీ అద్దం మాత్రం పెద్దది కావాలి. కనీసం చీర కట్టుకునేప్పుడైనా శ్రీరాం గమనించొచ్చు. అందుకే అద్దం గురించి రెడ్ పెన్సిల్‌తో రాసాను.

బెడ్‌ప్రక్కనుండే కార్నర్‌లో ఓ ఇత్తడి పూలకుండీ వుండాలి. దానిలో గాజుసీసా పెట్టి నీళ్ళు పోసి, అందులో ఫ్రెష్ రజనీ గంధాలు, ఫెర్న్ ఆకులూ పెడ్తూ వుండాలి. ఇది రాయలేదు కానీ, మనసులో అనుకున్నా. ఆ..యింకా చక్కని టేప్ రికార్డర్ కావాలి.

''నీ వూహతోనే పులకించిపోయే, ఈ మేను నీదోయీ..'' లాంటి తెలుగు పాతపాటలూ.

''ఎమేరా ప్రేమ్ పత్ర్ పఢ్ కర్..'' లాంటి పాత హిందీ పాటలు వింటూ... రజనీ గంధపూల వాసల్ని అతనితో పాటుగా ఆఘ్రాణిస్తూ-టిక్కుటిక్కు టైంపీసు మాత్రం బెడ్ రూంలో వుండకూడదు. ఇలా-

వూహిస్తూ రాస్తూ, రాస్తూ, వూహిస్తూ వుంటే శ్రీరామ్ వచ్చేసారు. ఆఫీసుకు వెళ్ళటానికి తయారై.

''ఏదీ రాసేసావా?'' అంటూ నా చేతిలో పేపరు తీసుకుని చదివి,

''ఏంటిదీ? నేను సరుకుల లిస్ట్ రాయమంటే నువ్వేదేదో రాసావు?'' అని అడిగాడు కాస్త చికాగ్గానూ, ఎక్కువ కోపంగానూ మొహం పెట్టి.

''అదేంటీ మీరేగా లిస్ట్ రాయమన్నారు? అయినా లిస్ట్ రాయటం దేనికి? సాయంత్రం మీరు ఇంటికి వచ్చాకా మనిద్దరం వెళ్ళి కావలసినవి సెలక్ట్ చేసుకుని ఆర్డర్ చేసుకోవచ్చుగా'' అన్నాను.

''ఏడ్చినట్టుంది. నేనన్నది ఇవన్నీ కాదు. ఇంట్లో సరుకులకి. ఇద్దరూ వెళ్ళి ఆర్డర్ చేయాలా? మా ఆఫీసు కాంప్లెక్స్ లోనే డిపార్ట్‌మెంటల్ స్టోర్ వుంది. రిడక్షన్ వుంటుంది. అందరూ ఇంటికి కావలసిన.వెచ్చాలన్నీ అక్కడే కొంటారు.

మనం కూడా అక్కడి నుండే తెచ్చుకునేది'' అన్నారు.

రంగులకల విరిగి పోయిన భావన.

''ఏడ్చినట్టుంది'' అనే మాట హృదయాన్ని చీల్చివేసింది.

కలలు లేని కాపురమా నాది? కోప మొచ్చింది. అయినా మొదట్లోనే కోపగిస్తే ఎలా? తొందరపడకూడదంటూ నన్ను నేను సర్దిచెప్పుకుని-

''వంటింటి అవసరాల విషయం నాకంటే మీకే బాగా తెల్సులా వుంది. మీరే తీసుకురండి'' అన్నాను కావాలనే.

''గుడ్'' అంటూ నా బుగ్గమీద చిటిక వేసి, వెళ్ళబోతుంటే-

''మరి బెడ్‌రూంలోకి కావలసినవి''- అని అడిగాను ఇంకా ఆశ చావక.

ఆయన చటుక్కున వెనక్కు తిరిగి- ''బెడ్ రూంకా? ఇంకా ఏం కావాలి? ఉన్నాయిగా పరుపూ మంచం'' అన్నారు.

''ఇవా''- అన్నా దిగులుగా. అవి శ్రీరాం బేచ్‌లర్‌గా వున్నప్పుడు వాళ్ళింటి నుండి తెచ్చుకున్న పాతమంచం, పాత పరుపూను.

''వాటికేం నిక్షేపంలా వున్నాయి. బానే నిద్రపోతున్నాంగా..'' అనేసి వెళ్ళిపోయాడు.

ఒక్కసారిగా విపరీతమైన నీరసం ముంచుకొచ్చేసింది.

నా భర్త మరీ యింత సీదాసాదా అనుకోలేదు. ఈ ఒక్క విషయంలోనే కాదు. అతనికి చాలా విషయాల్లో ఆసక్తి లేదు. పండగలూ, పుట్టినరోజులూ అన్నీ శుద్ధ వేస్టట. ప్రతి మనిషికీ కడుపునిండా తిండీ, చేతినిండా పనీ, కంటి నిండా నిద్ర వుంటే చాలట.

''ఒకరింటికి వెళ్ళి, అనవసరంగా వాళ్ల టైం వేస్ట్ చేయటమెందుకూ? మన మొచ్చామని, వాళ్ళు కాఫీలో, టిఫిన్‌లో పెట్టటం. మనం వచ్చేసాకా అవన్నీ వాళ్ళు కడుక్కోవటం శ్రమ కదా? అలాగే వాళ్ళు మనింటికొచ్చినా మనకీ అంతే శ్రమకదా? ఏమైనా అర్జంటు విషయాలు వుంటే ఫోన్లో మాట్లాడుకుంటే సరిపోతుంది.''

''పోనీ పార్క్‌కో, టేంక్‌బండ్‌కో వెళ్దామా?'' అంటే,

''ఎందుకోయ్ పెట్రోల్ దండగ. పైగా పొల్యూషన్. ఆరోగ్యానికి మంచిది కాదు. ఎలాగూ టీవీ వుందిగా. నువ్వు శుభ్రంగా పకోడీలు చెయ్యి. తింటూ టి.వి. చూడొచ్చు.'' అంటాడు. అన్నింటికీ యిలాంటి జవాబులే.

నాకు ఈయన్ను చూస్తుంటే రాన్రాను విరక్తి వస్తోంది. అందరూ పెళ్ళి చేసుకుంటారు కాబట్టి అతను చేసుకున్నాడు. అతనో వుద్యోగస్థుడే కానీ, గృహస్థుమాత్రం కాదు. ఈయన కంటే మా తాత బెటర్. ఇంత వయసు వచ్చినా నవ్వుతూ నవ్విస్తూ- ఇంట్లో మనుషులను ఉత్తేజంగా వుంచుతాడు.

శ్రీరాంతో ఒక సంవత్సరం గడిపేసరికి నాకర్ధమయినదేవిటంటే-

అతనికి పెద్ద బాధ్యతలు పట్టవు. వంట చేసిపెట్టి, అవసరాలు తీర్చేందుకో మనిషి వుంటే చాలు. ఆమెకి కూడా తినడం, పడుకోవడం తప్ప సరదాలు, సరసాలు లాంటి పట్టింపులు లేకపోతే అంతకంటే సుఖం ఈ భూ ప్రపంచంలో మరోటి లేదు.




నా బాధంతా ఒకటే. ఇట్లాంటి మనిషి పెళ్ళెందుకు చేసుకున్నాడాని? అదే అడిగితే-

''ఏం నీకు తిండీ పెట్టటం లేదా?''- అని అడిగాడు.

ఆ మాటతో నాలోని శతసహస్ర రసతంత్రులూ ఒక్కసారిగా ఫెరేల్మని మంటలా ఎగిసి, చప్పున అణగి, ఛర్రున తెగిపోయి, చెదిరిపోయాయి. నో..నో..నో ఇది కాదు. ఇలాంటి జీవితం కాదు నాకు కావల్సింది.

నాకు స్నేహం కావాలి. ప్రేమ కావాలి. భర్త సాన్నిధ్యం కావాలి. లాలింపు కావాలి. కవ్వింపు కావాలి. ఇవేవీ అతని దగ్గర లేవు. నాయనమ్మ హెచ్చరికలతో పుట్టిల్లు అనేది మనసుకెప్పుడో దూరమైంది. అక్కడికి వెళ్ళలేను. ఇక్కడ వుండలేను.

పెళ్ళనేదో రంగుల బుడగ. ఆర్భాటంగా గాలిలోకి ఎగురుతుంది. అప్పుడు తెల్సుకుంటుంది. సమన్వయంగా రెక్కలు లేవు విహరించటానికని. వెంటనే పేలిపోతుంది. ఇక మిగిలేదంతా శూన్యం. వాటే గ్రేట్ ట్రాజడీ! క్రమంగా అలవాటు పడ్తున్నా ఈ శూన్యంలో- నా మనసూ, నా శరీరం వేరయిపోసాగాయి.

నా శరీరం యోగిగా మారుతుంటే-

నా మనసు భోగిగా ప్రాణం పోసుకుంటోంది.

నా మనసులో ఓ ఆకృతి రూపు దాలుస్తోంది. ఓ ఇంద్రధనస్సూ, ఓ నందనవనం, ఓ చలువరాతి చష్టా, ఓ మానసిక వూహా స్పర్శ, నన్ను ప్రేమిస్తూ..లాలిస్తూ..నవ్విస్తూ..కవ్విస్తూ..ఆహ్లాద పరుస్తూ..

ఆ ఊహామూర్తి నాకు చాలా అపురూపం. అతను మంచి భర్త. చక్కని గృహస్థు. అతను ఉదయభానుడికి నా ఒడిని ఉయ్యాల చేస్తాడు. సాయం సంధ్యాకాంతను మా పొదరింటికి, అతిథిగా ఆహ్వానిస్తాడు. రాత్రి వెన్నెలతో నాకు పక్క పరుస్తాడు. నాతో కల్సి ప్రకృతి పాడే మధుర గీతాల్ని వింటాడు. నా తలలో మల్లెలనీ, పక్కనుండే రజనీగంధాలనీ, ఆఘ్రాణిస్తూ వుంటాడు.

కాలం నెమ్మది. నెమ్మదిగా జరిగిపోతోంది.

ఊహల్లో జీవిస్తూ, వాస్తవజీవన ఓటమిలో బ్రతుకుతున్న నాకు అంతిమ ఘడియలెప్పుడో?! ☆

వల్లూరి హైమారెడ్డి